# సర్వస్వం

ఎమ్. పార్థసారథి



ఒక పాత పెంకుటింటి పెరట్లో-

వేసవి మధ్యాహ్నపు ఏకాంతంలో-

జామచెట్టు కింద, వయసిచ్చిన అందం తప్ప మరే అర్హతాలేని ఓ పదహారేళ్ళ అమ్మాయి మనసు నిండా తియ్యటి కలలతో-

“బావా, నువ్వే నా సర్వస్వం నీ తోనే నా జీవితం. నీ ప్రేమ లేందే నేను బ్రతక లేను. నా హృదయం నీది. నువ్వు లేని జీవితం నేనూహించలేను. మా యింట్లో వాళ్లు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సరే, ఈ లోకం ఏమన్నా సరే-నేను నీ

దాన్ని. మన ప్రేమ శాశ్వతం. మనో వాక్కాయ కర్మలా నేను నీ దాన్ని," అంది తన మెడికో మేనబావ రఘురాంతో.

మరో రెండేళ్లకు-

తలుపులన్నీ వేసిన శోభనపు గది వుక్కలో, పట్టు చీర పరపరలో, అగరొత్తుల ఘుమఘుమలో, పాతి వ్రత్యంతో పరవశించెంది, ఓవర్సీరు రామలింగానికి పాదాభివందనం చేసి

"నేను మీ దాన్ని. నా శరీరం, నా మనసు మీ అధీనం. నా జీవితం మీ కంకితం. మీరే నా ఆరాధ్య దైవం. నా గుండెను గుడిగా చేసి మీ రూపాన్నే అందులో ప్రతిష్ఠించుకున్నాను. మీ దాసిగా బ్రతికి, సుమంగళిగా మీ ఒళ్లో తల పెట్టుకుని కళ్లు మూయటమే నాక్కావలిసింది. మీరే నా సర్వస్వం," అంది, ఆవిడే

ఆ తర్వాత-

నొసట కుంకుమ చెరిగి, పసిగుడ్డును చేతుల్లో పట్టుకుని, అన్నగారింటి పంచన నిలిచి.

"అన్నయ్యా! ఇంక నాకీ బ్రతుకులో మిగిలిందేమీలేదు. తల్లివైనా, తండ్రివైనా నువ్వే నాకు అన్నీ. ఈ పసికందును పెట్టుకుని నీ యింట్లో పనిమనిషిగానైనా బ్రతుకుతాను. నా దేవుడు నన్నొదిలి వెళ్ళిపోయాడు అన్నయ్యా, ఇంక నువ్వే నాకు దిక్కు," అని కూడా అంది.

కొడుకు పెరిగి పెళ్ళీడు కొచ్చాడు.

"ఒరేయ్ నాయనా, ఇన్నాళ్లు నేనెందుకు బ్రతికాననుకున్నావు. నీ కోసం. నాకీ బతుకులో యింకా ఏ మాశ వుందిరా, నువ్వు తప్ప. నువ్వు సుఖపడితే చూడాలనే యిన్నాళ్లున్నాను. నీ కోసమేరా నాయనా, నేనిన్నాళ్ళున్నాను" అని అంది కొడుకుతో.

ఆ తర్వాత, మరో ఐదేళ్లకు, మనవళ్లను ముందేసుకుని కూర్చుని-

"అడ్డాల నాడు బిడ్డలు గాని, గడ్డాల నాడు గాదురో. వాడికోసం యింత చేస్తే వాడికీనాడు పెళ్లాం బెల్లమైపోయింది. ఇప్పుడైతే ఎత్తుకో మంటూ చేతులిస్తున్నారుగాని రేపు పెరిగి మీరెంత మర్యాద చేస్తారో? నాయనా రండి. అంతా మీ దయ," అంటో ఆమె మనము చేతుల్లాగుతుంటే నవ్వుకుంటూ, తిట్టుకుంటూ. సాధించుకుంటూ వాళ్ళను దగ్గరకు తీసుకుంది.

